రూ.3.26 కోట్ల నిధులు గోల్‌మాల్

అకౌంట్స్ మేనేజర్‌పై సీసీఎస్‌లో కేసు

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): యశోద ఆస్పత్రి గ్రూప్స్‌కు సంబంధించిన రూ.3.26 కోట్లు పక్కా ప్లాన్‌తో దుర్వినియోగం చేసిన అకౌంట్స్ మేనేజర్, ఆయన భార్యతో పాటు మరికొందరిపై సీసీఎస్‌లో కేసు నమోదైంది. యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (వైఎస్ఎస్‌హెచ్), యశోద హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (వైహెచ్ఎస్‌పీఎల్) యశోద గ్రూప్‌లో ఉన్నాయి. ఈ సంస్థల కార్పొరేట్ కార్యాలయం నాగార్జున్ హిల్స్‌లో ఉంది. కాగా, వైహెచ్ఎస్‌పీఎల్‌లో బాచుపల్లి నివాసి రామ్ నర్సింగ్ 2020లో అకౌంట్స్ మేనేజర్‌గా చేరాడు. యశోద గ్రూప్స్‌కు సంబంధించిన సిబ్బంది జీతభత్యాలు, బ్యాంకు ఖాతాల వ్యవహారాన్ని చూసుకున్నాడు. రామ్‌నర్సింగ్ ఆయన భార్య కామేశ్వరితో పాటు ప్రవీణ, శ్రీరామ్మూర్తి బ్యాంకు ఖాతాలను యశోద గ్రూప్స్ నుంచి జీతాలు ఇచ్చే బ్యాంకు ఖాతాలోని బెనిఫిషియరీ లిస్ట్‌లో చేర్చాడు. ఉద్యోగుల లిస్టులలో లేని ఈ నాలుగు ఖాతాలకు ప్రతి నెల లక్షల రూపాయలు బదిలీ చేశాడు. 2021 మే నుంచి సెప్టెంబర్ 2023 వరకు రూ. 3.26 కోట్లు పక్కదారి పట్టించి, భారీగా ఆస్తులు కొనుగోలు చేశాడు. రామ్‌నర్సింగ్ 2023, నవంబర్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయాడు. 2024లో రికార్డులను పరిశీలించగా ఈ మోసం బయటపడింది. యశోద గ్రూప్ ఫైనాన్స్ కంట్రోలర్ ముఖేశ్ కుమార్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

నిఘా నీడలో పోలింగ్ స్టేషన్‌లు

14 నియోజకవర్గాలు..

7236 పోలింగ్ బూత్‌లు

ఈ నెల 14వ తేదీ ఉదయం వరకు మద్యం బంద్

డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్న పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగే విధంగా అన్ని పోలింగ్ స్టేషన్లను సీసీ కెమెరాలతో పర్యవేక్షించేందుకు పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 14 పార్లమెంట్ నియోజకవర్గాల్లో సోమవారం లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గంలో శాసనసభ ఉప ఎన్నిక కూడా జరగనున్నది. ఈ ఎన్నికలకు సంబంధించి మూడు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 4,496 పోలింగ్ లొకేషన్లు, 7,236 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడు కమిషనరేట్ల పరిధిలో సుమారు 20వేల మంది పోలీసులతో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో దాదాపు 4500 మంది కేంద్ర బలగాలు, 6000 మంది తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ ఫోర్స్ బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. సున్నిత, అతి సున్నితమైన పోలింగ్ స్టేషన్లు, లొకేషన్‌లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ స్టేషన్ల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్లలోకి సెల్‌ఫోన్లను అనుమతించరని, నగర కమిషనరేట్ పరిధిలో ఈ నెల 11 సాయంత్రం 6 నుంచి 14వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి వేయడం జరుగుతుందని సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. మిగిలిన రెండు కమిషనరేట్ల పరిధిలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఎన్నికలు ముగిసే వరకు మద్యం దుకాణాలు మూసి ఉంచడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన కమిషనర్లు..

ఎన్నికల ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ సీపీ తరుణ్‌జోషి పర్యవేక్షించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లను పరిశీలించారు. రాచకొండ పరిధిలోని సైనిక్‌పురి భవన్స్ కళాశాల, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, గుర్రంగూడలోని స్ఫూర్తి కళాశాల, మేడ్చల్‌లోని హోలిమేరీ కళాశాల.. తదితర పోలింగ్ లొకేషన్లలో ఎన్నికల ఏర్పాట్లను సీపీ తరుణ్‌జోషి పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తు చర్యలను అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా వ్యవస్థకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలలో కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ అధికారులు కలవకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీపీతో పాటు ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఏసీపీలు, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాలి

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

బండ్లగూడ, మే 12: సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఆయన అత్తాపూర్ సిక్‌చావనీలో ఉన్న గురునానక్ పాఠశాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలంటూ పోలీసులను ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా.. తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

వదంతులు నమ్మకండి..

సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పోస్టులు పెట్టినా, రెచ్చగొట్టే, ఇతరులను కించపరిచే విధంగా పోస్టులు పెట్టినా చట్ట పరమైన చర్యలు తప్పవని పోలీసు కమిషనర్లు హెచ్చరించారు.

విస్తృతంగా తనిఖీలు

రూ.23.84 కోట్ల నగదు స్వాధీనం

సిటీబ్యూరో, మే 12, (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.23.84 కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. రూ. 26.03 కోట్ల విలువ చేసే ఇతర వస్తువులు, 27,715.965 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. 356 మందిపై కేసులు నమోదు చేసి, వారిని అరెస్టు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 727 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించారని, 472 మందిపై ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తాజాగా, గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.65,18,700 నగదు, రూ.5.36 లక్షల విలువ చేసే వస్తువులను పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు.

ఫ్యాట్ పీజియన్ పబ్‌పై కేసు

బంజారాహిల్స్, మే 12: రోడ్డుపై రాకపోకలకు అడ్డంకులు కల్పించేలా కారు పార్కింగ్ చేయిస్తున్న పబ్ నిర్వాహకులపై జూబ్లీ హిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లోని ఫ్యాట్ పీజియన్ పబ్ వద్ద వీకెండ్స్‌లో వచ్చే కస్టమర్లు మొత్తం తమ కార్లను రోడ్డు పక్కనే పార్క్ చేస్తుండటంతో విపరీతంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దుర్గం చెరువు నుంచి వచ్చే వాహనాలు నెమ్మదిగా ముందుకు వెళ్లాల్సి రావడంతో పాటు పలుమార్లు ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిర్వాహకులపై ఐపీసీ 341, 290 సెక్షన్లతో పాటు సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దారి కాచి దోపిడీ

బంజారాహిల్స్, మే 12 : దారి కాచి, దాడి చేసి నగదును దోచుకున్న దుండగులు పారిపోయారు. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండకు చెందిన ఎండీ జావేద్ (27) వీడియో గ్రాఫర్. సాయంత్రం పని ముగిసిన తర్వాత అతడి స్నేహితులు సయ్యద్ మహ్మద్ అమీర్, సోహైల్‌తో కలిసి హకీంపేట మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. అదే క్రమంలో ఐదుగురు దుండగులు వారిని అటకాయించారు. అకారణంగా పిడిగుద్దులు గుద్ది దాడి చేశారు. బాధితుడి వద్ద ఉన్న నగదు తీసుకొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కులు తక్కువొచ్చాయని..

ఘట్‌కేసర్, మే 12: మార్కులు తక్కువగా వచ్చాయని ఇతర విద్యార్థుల ముందు అవమానంగా భావించిన ఓ విద్యార్థిని క్లాస్ రూంలో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ సైదులు కథనం ప్రకారం... ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్‌లోని హ్యాపీ హోమ్(ఆర్ఫాన్ హోమ్)లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న కె.స్వప్న(20)కు గత నెలలో వచ్చిన ఫలితాల్లో వెయ్యికి 700 మార్కులు వచ్చాయి. దీంతో తనకు మార్కులు తక్కువగా వచ్చాయని తోటి విద్యార్థులకు చెప్పుకుంటూ బాధపడేది. ఈ క్రమంలో ఆదివారం క్లాస్ రూంలోకి వెళ్లి చున్నీతో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆర్ఫాన్ హోమ్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మీ ఆధార్ కార్డును.. ఉగ్రవాదులు వాడుతున్నారు

డబ్బులు కట్టి సెటిల్ చేసుకోండి

మహిళ‌ను బ్లాక్ మెయిల్ చేసిన సైబర్ చీటర్స్

బంజారాహిల్స్, మే 12: మీ ఆధార్ నంబర్ ఆధారంగా పలు సెల్‌ఫోన్ నంబర్లను తీసుకొని కశ్మీర్‌లోని టెర్రరిస్టు కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు.. డబ్బులు కట్టి విషయాన్ని సెటిల్ చేసుకోండి.. లేకుంటే జైలుకు పోతారు.. అంటూ ఓ మహిళను సైబర్ నేరగాళ్లు బ్లాక్ మెయిల్ చేసి దోచుకున్నారు. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్ రోడ్ నం.86 నివాసి ఫాతిమా ఖాన్ (25) గృహిణి. ఈ నెల 9న గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. తాము ముంబైలోని ఫెడెక్స్ పార్సిల్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పారు. ముంబై నుంచి తైవాన్‌కు బాధితురాలి పేరిట ఓ పార్సిల్ ఉన్నదని, అందులో ఐదు పాస్‌పోర్టులు, మూడు క్రెడిట్ కార్డులు, ఒక ల్యాప్‌టాప్, బట్టలు, 200 గ్రాముల ఎండీఎం డ్రగ్స్ ఉన్నాయని పేర్కొన్నారు. ఆ వెంటనే ఆమె ఆధార్ కార్డు నంబర్ కూడా చెప్పారు. ముంబై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని, పోలీసు స్టేషన్‌ను సంప్రదించాల్సి వస్తుందని సూచించారు. దీంతో భయభ్రాంతులకు గురైన బాధితురాలు.. తాను ఢిల్లీలో ఉంటానని ముంబైకి రాలేనని చెప్పింది. స్కైప్ ద్వారా వీడియో కాల్ చేసి, నేరుగా ముంబై పోలీసులతో మాట్లాడిస్తామంటూ చీటర్స్ సూచించారు. ఆ వెంటనే ఆమె స్కైప్ కాల్ చేయగా, పోలీసు మాదిరిగా ఉన్న ఓ వ్యక్తి ఆమెను సంప్రదించారు. మీ ఆధార్ కార్డు నంబర్ ద్వారా పలు సెల్‌ఫోన్ నంబర్లు ఉన్నాయని, అవి కశ్మీర్‌లోని టెర్రరిస్టులు వారి కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా.. బెంగళూరు, బిహార్, ఒడిశా, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో పలు బ్యాంకు అకౌంట్లకు సైతం వినియోగిస్తున్నారని, ఈ ఖాతాలన్నీ టెర్రరిస్టు కార్యకలాపాలతో సంబంధాలు ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత నవాబ్ మాలిక్‌కు సంబంధించినవని చెప్పారు. డ్రగ్స్‌ను ఎగుమతి చేస్తున్నందుకు జైలుకు పోవా లి వస్తుందంటూ ఆమెను బెదిరించారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే బ్యాంకు ఖాతా వివరాలు చెప్పడంతో పాటు రూ.21,212 నగదును వారు సూచించిన ఖాతాలో జమ చేయాలని సూచించి, చేయించుకున్నారు. డబ్బులు చెల్లించినట్లు వెరిఫికేషన్ కాల్ వస్తుందని నమ్మబలికారు. ఎలాంటి కాల్ రాకపోవడంతో ఆమెను మభ్యపెట్టి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని ఆమె భావించారు. ఫిల్మ్‌నగర్ పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్ నియోజకవర్గం చిలకానగర్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల పోలింగ్ కేంద్రంలోకి వస్తున్న దివ్యాంగ అధికారులు

ఎన్నికల వేళ నగరం ఖాళీ..

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటేసేందుకు నగర వాసులు సొంతూళ్లకు వెళ్లడంతో ఆదివారం హైటెక్ సిటీ నుంచి కేపీహెచ్‌బీ కాలనీ వెళ్లే ఫ్లైఓవర్ నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-328125

BUSINESS OFFER

★ఫ్రాంచైసీ తీసుకోండి లేదా ఒకసారి పెట్టుబడి పెట్టి ప్రతిరోజు లాభాలు పొందవచ్చు అగ్రిమెంట్ కలదు ఆఫీస్ అడ్రస్ నాగోల్ ఎక్స్ రోడ్: 9381721590 NT-339503

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 26/5 చార్‌ధాం, 11/6 నేపాల్ ముక్తినాథ్, 7/7 నవాదేవి అమరనాథ్, 10/7 వైష్ణవి అమరనాథ్ @ 9908844377 NT-311998

LAND FOR SALE

★శ్రీశైలం హైవేలో 12 ఎకరాలు DTCP లేఅవుట్ LP No. వచ్చింది మార్కెటింగ్‌కు ఇవ్వబడును. అడ్వాన్స్ రూ।।లు కంపల్సరీ ఉంటుంది. 9177619716. NT-328341

★సాగర్ హైవే ఫేసింగ్ వెంచర్‌కు అనుకూలమైన జోన్‌లో 2 ఎకరాలు మరియు 4 ఎకరాలు & 11.5 ఎకరాలు కలవు. సంప్ర: 9701253555. NT-339504

PLOT FOR SALE

★కేవలం 9 లక్షలకే DTCP అప్రూవ్ ప్లాట్లు నియర్ వంగపల్లి/బీబీనగర్ & ఘట్‌కేసర్ HMDA ప్లాట్లు కలవు. మీ పిల్లల భవిష్యత్తుకై ఇప్పుడే కాల్ చేయండి. 9666703666. NT-320393

HOUSE FOR SALE

★New Maruthi Nagar, Dr. A.S. Rao Nagar, ECIL, House for Sale in 323 sq. yds, East Face, 25' Feet Road, @ 2 Cr. Ph: 9959151595 NT-328136

COMMERCIAL FOR SALE

★Commercial 1st Floor Abids 3528 Sft. Attached Men/Women Rest rooms. Most Suitable for BPO. Chance Deal. Rs.5,299/ Sft. clr Title. no dedicated parking. 9948350002 NT-328338

WANTED

jobs Apply Now!

★రియల్ ఎస్టేట్ సంస్థ కొరకు సొంత కారు ఉండి, మా కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు అనుభవము కల్గిన వారికి ఇదే మా ఆహ్వానం. సంప్రదించండి: 7981217883 NT-339501

★Required Qualified & Experienced Lady Teachers for SAV HIGH SCHOOL (EM) Anantha Saraswathi Nagar East Anand Bagh. Contact: 9985645292, 9701264412. NT-327615

★ACCOUNTANTS/ Assistants, Graduates/ CA Articles with Exp in Tally, GST, Income Tax. M/F Salary 10-25k. Murthy & Sastry Narayanaguda Metro Pillar B-1176, Hyd. telikepalli2001@rediffmail.com. Ph: 9396549089 NT-327805

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253 NT-3277-All

JOBS

★Wanted Female Staff Fresher/ Experience - Accountant, Graphic Designer, Office Assistant, - Good Salary - Flexible Timing work in Narayanguda. Ph: 9246509038 NT-327622

CHANGE OF NAME

★I, ARADHANA CHETAN GADI W/o CHETAN G J, R/o. Flat No.104, 3-4-529/5, Narayanguda, Hyderabad, Telangana-500027, have changed my name from GANGAVVA NAGAPPA KAREMANI to ARADHANA CHETAN GADI as per affidavit dated 30.11.2022 for all educational and other purposes. NT-328143

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడ మైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏదైనా కావలసిన సమాచారం కొరకు సంబంధించిన వర్గం... మమ్ "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి...

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

Cell: 9848077857

ఎల్బీనగర్, పెద్దఅంబర్‌పేట : 9182777202 | అబిడ్స్, పెద్దఅంబర్‌పేట : 9182777126 | దిల్‌సుఖ్‌నగర్ : 9182777805

మల్కాజ్‌గిరి, E.C.I.L : 9182777125 | ఉప్పల్, తార్నాక : 9182777806 | L.B.నగర్, వనస్థలిపురం : 9182777209 | B.N.రెడ్డి నగర్, హయత్‌నగర్ : 9182777204 | కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205

మైనర్‌పై లైంగిక దాడి

దవాఖానలో ప్రసవించడంతో..

వెలుగులోకి వచ్చిన ఘటన

ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

వెంగళరావునగర్, మే 12: చదువుతున్న బాలిక (15)కు మాయ మాటలు చెప్పిన శ్రీను (28) పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. కడుపునొప్పితో దవాఖానలో చేరిన బాలిక అక్కడే ప్రసవించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు.. పోలీసు స్టేషన్ పరిధిలో నివసించే బాలిక వేరొక రాష్ట్రంలోని బాలికల పసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నది. సెలవుల్లో తరచూ ఇంటికి వచ్చి వెళ్లేది. ఈ క్రమంలోనే ఇంటి పక్కనే ఉంటున్న శ్రీను కుమారుడిని ఆడించేది. కామాంధుడైన శ్రీను.. ఆ బాలికపై కన్నేసి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భయంతో బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. ఈ క్రమంలో బాలిక రెండు రోజులుగా కడుపునొప్పిగా ఉన్నదని చెప్పడంతో కుటుంబసభ్యులు సమీపంలోని ఓ ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడ బాలికను పరీక్షించిన వైద్యులు గర్భవతిగా తేల్చారు. నెలలు నిండని బాలిక అప్పుడే ప్రసవించింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాస్కులతో వచ్చి.. రాడ్లతో కొట్టి

గ్యాస్ ఏజెన్సీలో దోపిడీ దొంగల బీభత్సం

రూ.5 లక్షలు దోచుకెళ్లిన దుండగులు

బంజారాహిల్స్, మే 12: ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో భారీ దోపిడీ జరిగింది. మాస్కులు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు గ్యాస్ ఏజెన్సీలోకి చొరబడి ఉద్యోగిపై దాడి చేయడంతో పాటు రూ.5 లక్షలు దోచుకువెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన తొండెపు శ్రీనివాస్‌రావు ఫిలింనగర్‌లోని మాధవీ గ్యాస్ ఏజెన్సీలో రెండేండ్లుగా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. గత శుక్రవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో గ్యాస్ ఏజెన్సీ మూసిన శ్రీనివాస్.. గేట్లకు తాళాలు వేసి మొదటి ఫ్లోర్‌కు వెళ్లి అకౌంట్స్ చూసుకుంటున్నాడు. కాసేపటికి ఇద్దరు దుండగులు ముసుగులు ధరించి శ్రీనివాస్ ఉన్న గదిలోకి ప్రవేశించారు. దాడి చేయడంతో పాటు కిందపడేసి మెడపై కాలితో తొక్కిపట్టడంతో పాటు స్ప్రే చల్లారు. రాడ్‌తో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గదిలో ఉన్న రూ.5లక్షల నగదుతో పాటు ఫోన్‌ను తీసుకుని గది బయట నుంచి గొళ్లెం పెట్టి పారిపోయారు. రాత్రంతా తీవ్రమైన రక్తస్రావంతో ఉన్న శ్రీనివాస్ కేకలు పెట్టినా నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఎవరూ రాలేదు. మరుసటి రోజు ఉదయం గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది శ్రావణ్, నరేశ్ వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాస్ కనిపించాడు. దీంతో అతడిని మెహిదీపట్నం సమీపంలోని ఓలివ్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో బాధితుడి వద్ద నుంచి ఫిర్యాదును స్వీకరించిన ఫిలింనగర్ పోలీసులు ఐపీసీ 394 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇంటి ప్రహరీ దూకి వచ్చి..

వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

శాలివాహననగర్‌లోని బాధితురాలి గృహం

ఖైరతాబాద్, మే 12: ఇంటి వెనుక ఉన్న ప్రహరీ దూకి ఇంట్లోకి వచ్చిన ఓ దుండగుడు వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించుకెళ్లాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని శాలివాహననగర్‌లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శాలివాహనగర్ నివాసి విజయలక్ష్మి ఇంట్లో వంట చేస్తున్నది. ఆ సమయంలో ఇంటి వెనుక వైపు ఉన్న ప్రహరీ దూకి వచ్చిన దుండగుడు ఆమెను బెదిరించి, ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయ్యాడు. బాధితురాలు ఈ ఘటనను కుటుంబ సభ్యులకు తెలుపగా, వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్ కుమార్, క్రాంతికుమార్ పరిశీలించి, చుట్టు పక్కల ఏర్పాటు చేసి ఉన్న సీసీ కెమెరాల పుటేజీని సేకరించారు. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడిగా నమ్మించి.. బాలిక మెడలో పసుపుతాడు

మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు

వెంగళరావునగర్, మే 12: పదిహేనేళ్ల బాలిక మెడలో ఓ యువకుడు పసుపు తాడు కట్టాడు. ప్రేమ పేరుతో నమ్మించి, సన్నిహితంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదివిన ఆ విద్యార్థిని తండ్రి ఓ ప్రమాదంలో చనిపోయాడు. గతేడాది డిసెంబర్‌లో బంధువుల వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వనపర్తి సమీపంలోని సొంతూరికి వెళ్లింది. అక్కడ వంశీ యాదవ్ (24) అనే యువకుడు పరిచయమయ్యాడు. నాలుగు రోజుల తర్వాత ఆమె హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. గతేడాది డిసెంబర్ 11వ తేదీన ప్రేమిస్తున్నానని.. పెండ్లి చేసుకోవాలనుకుంటున్నానని విద్యార్థినికి ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ పెట్టాడు. ఆ విద్యార్థిని యువకుడి ప్రతిపాదనను తిరస్కరించింది. మంచి స్నేహితుడిలా ఉంటానని నమ్మబలికి మళ్లీ చేరువయ్యాడు. జనవరి ఒకటో తేదీన ఇద్దరు కలిసి గుడికి వెళ్లారు. ఆ తర్వాత ఆమెను వనపర్తికి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి మాయమాటలు చెప్పి స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి బలవంతంగా బాలిక మెడలో పసుపు తాడు కట్టాడు. సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు తీశాడు. అ తర్వాత ఎవరింటికి వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత దూరం పెడుతుందన్న కోపంతో బాలికతో సన్నిహితంగా ఉన్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటో పెట్టి వేధింపులకు గురిచేస్తున్న వంశీయాదవ్‌పై పోక్సోతో పాటు.. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం పెట్రోల్ ట్యాంకర్‌లో అకస్మాత్తుగా మంటలు

ఆర్పేందుకు యత్నించిన పలువురికి గాయాలు

సిటీబ్యూరో,మే12(నమస్తే తెలంగాణ): నగర